క్లుప్తంగా

కాళికాంబాదేవికి ప్రత్యేక పూజలు



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీ చౌక్‌లో వెలసిన శ్రీకాళి కాంబ చంద్రశేఖరస్వామి ఆలయంలో శుక్రవారం మాఘమాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదట అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం చేసి పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తర్వాత అమ్మవారికి ఒడి బియ్యం, రాహుః కాల పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్, నరసింహ, అంబరీష్, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రమణ్యం శాస్త్రిలు పాల్గొన్నారు.

పాల డెయిరీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

నంద్యాల(అర్బన్): అకారణంగా తొలగించిన పాల డెయిరీ కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ఉపాధ్యక్షుడు తోటమద్దు కోరారు. 20ఏళ్లుగా డెయిరీలో పని చేస్తున్న కార్మికులను తొలగించడం అన్యాయమంటూ శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కొద్దిసేపు ధర్నా నిర్వహించి జిల్లా ఇన్‌చార్జ్ ఏసీఎల్ బసిరున్నిసాకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారణాలు లేకుండా కార్మికులను తొలగించడం దుర్మార్గమని, విధుల్లోకి తీసుకోకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జైలాన్, హారూన్, నర్సయ్య, బలరాం, వెంకటరావు, ప్రసాద్, సుబ్బయ్య, ప్రభాకర్, నాగరాజు, గోపాల్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

ఉయ్యాలవాడ: స్థానిక 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి నెల 3వ శనివారం మరమ్మతులు చేపడతామని, శివరాత్రి పర్వదినం సందర్భంగా 2వ శనివారమే ఈ పనులు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. వ్యవసాయానికి తెల్లవారుజామున 4 గంటల నుంచి సరఫరా ఉంటుందన్నారు. ఈ అంతరాయానికి వినియోగదారులు, వ్యాపారులు, రైతులు సహకరించాలని కోరారు.

ఈ-కేవైసీ తప్పని సరి




మాట్లాడుతున్న ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి

ఆళ్లగడ్డ: రబీలో సాగుచేసిన పంటలకు ఈ-క్రాప్ నమోదు తర్వాత ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం చాగలమర్రిలోని రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు రైతులకు వర్తించాలంటే ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే పీఎం కిసాన్ కొరకు రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ రంగ నేతాజీ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఓ నరేష్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

శిరివెళ్ల: పీఎం కిషాన్ లబ్ధికి ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ సుధాకర్ రైతులకు సూచించారు. శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 10 వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారన్నారు. ఇందుకు అవసరమైన మేరకు ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. రైతులు పంట వివరాలను సమీప రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు.

వెన్నపూసకే మొదటి ప్రాధాన్యత ఓటు



ప్రచార పత్రాలను విడుదల చేస్తున్న న్యాయవాదులు

ఆళ్లగడ్డ: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక కోర్టు ఆవరణలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఎన్నికల ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామిరెడ్డి, అశ్వత్థరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చేసిన మేలును వివరిద్దాం

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పిలుపు
- రుద్రవరంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం



మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే బిజేంద్రనాథ్‌రెడ్డి

రుద్రవరం: మూడున్నరేళ్ల పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును ఇంటింటికీ వెళ్లి వివరిద్దామని ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక వాసవీ కన్యాకపరమేశ్వరీ ఫంక్షన్ హాల్లో మా నమ్మకం నువ్వే జగనన్న అనే కార్యక్రమం నిర్వహించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు హాజరైన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రజారంజకపాలన కోసం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇందుకు ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలు, పేదలకు చేకూరిన లబ్ధి గురించి ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. టీడీపీ నాయకుల మాదిరిగా మనం అబద్ధాలు చెప్పలేదని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా పథకాలు అందించామని, అవినీతికి ఆస్కారం లేకుండా డీబీటీ విధానంలో నేరుగా లబ్ధిదారులకు సాయం అందజేశామన్నారు. ప్రస్తుతం కల్యాణమస్తు, షాదీ తోఫా పథకంతో ఎంతో మందికి లబ్ధిచేకూరుతుందన్నారు. ఈ పథకాన్ని సీఎం పేదల కోసం ప్రారంభించారన్నారు. అనంతరం ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి మాట్లాడుతూ 11 నుంచి మొదలవుతున్న మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని గృహసారథులు ప్రతిష్టాత్మకంగా చేపట్టాలన్నారు. అమ్మ ఒడి, వైఎస్సార్ రైతు భరోసా, సున్నావడ్డీ, కాపునేస్తం, వైఎస్సార్ చేయూత తదితర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు సిఫార్సు చేస్తేనే సంక్షేమ పథకాలు అందేవన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నామన్నారు. పాలనలో టీడీపీ ప్రభుత్వానికి నేటి జగనన్న సర్కారుకు ఉన్న తేడాను ప్రజలకు తెలియజేయాలన్నారు. లబ్ధిదారులకు మూడున్నరేళ్లలో ఒక్కో కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించి మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్‌ను వారి ఇళ్లకు అతికించాలన్నారు. కార్యక్రమంలో పుట్టాలమ్మ క్షేత్రం చైర్మన్ మనోహర్‌రెడ్డి, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీపీ బాలస్వామి, జెడ్పీటీసీ మాధవీ, పుట్టాలమ్మ కమిటీ సభ్యులు గంగిశెట్టి తిమ్మయ్య, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మానవతా నైతిక ఉద్యమం



కరపత్రాలను విడుదల చేస్తున్న జమాతే ఇస్లామి హింద్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 20 వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా మానవతా నైతిక ఉద్యమం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ నేత అబ్దుల్ సమ్మద్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆ సంస్థ కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. మానవత్వ, నైతిక విలువలు తదితర అంశాలపై ప్రజలకు చర్చాగోష్టులు, సమావేశాలు ద్వారా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జకారియా, మోమిన్‌గౌస్, అబ్దుల్‌ఖాదర్, సలీం, అబ్బాస్ అలీ, అబూబకర్, జైనుల్లా తదితరులు పాల్గొన్నారు.

మెస్ బిల్లులు పెంచాలి



చింతామణికి వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పెరిగిన ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని ఆర్‌వీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయుడు కోరారు. ఈ అంశంపై శుక్రవారం ఆర్‌వీఎఫ్, ఏఐవైఎల్, ఏఐఎఫ్‌బీ సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు నంద్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట ఖాళీ ప్లేట్లతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాజునాయుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లలో లక్షలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, 2018 నుంచి మెస్ చార్జీలు పెరగక వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రీ మెట్రిక్ హాస్టల్ విద్యార్థులకు నెలకు ఇచ్చే రూ.1250 ను రూ.2500కు పెంచాలన్నారు. కాలేజీ హాస్టల్ విద్యార్థికి రూ.3 వేలు చేయాలన్నారు. అలాగే హాస్టల్ వార్డెన్ విద్యార్థులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి చింతామణికి ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు రవీంద్రనాథ్, ప్రతాప్, వెంకటాద్రి, శ్రీనివాసరావు, బాలకృష్ణనాయక్ పాల్గొన్నారు.

ఆర్బీకేలను సద్వినియోగం చేసుకోండి



రుద్రవరం ఆర్బీకేలో యంత్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

రుద్రవరం: రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయ సంబంధ సలహాలు, సూచనలు, సేవల కోసం ఆర్బీకేలను సంప్రదించాలన్నారు. సీజన్ల వారీగా రాయితీ విత్తనాలు, పంట నమోదు, పంటలకు సోకే తెగుళ్లను పరిశీలించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. అనంతరం ఆర్బీకేలోని రికార్డులను తనిఖీ చేసి వెలగలపల్లె గ్రామం వద్ద పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆయన వెంట ఏఈఓ రాజు, వీఏఏలు ఉన్నారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

గోస్పాడు: పంట సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్ రైతులకు సూచించారు. స్థానిక ఆర్బీకే వద్ద శుక్రవారం వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే ఈ క్రాప్ బుకింగ్ తర్వాత ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అవసరమైన ఎరువు, పురుగు మందులు ఆర్బీకేలలో లభిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా కొందరు రైతులు టార్పాలిన్లు, స్ప్రేయర్లు, తదితర వ్యవసాయ పరికరాలు కావాలని అడగగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ, ఉద్యానవన, అధికారులు, సిబ్బంది, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవాలి

నంద్యాల(సిటీ): ఇటీవల నిర్వహించిన నేషనల్ మీన్స్‌కంమెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు హాజరైన విద్యార్థులు ఈ నెల 20వ తేదీ లోపు ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ శుక్రవారం తెలిపారు. జాతీయ విద్యా మంత్రిత్వ శాఖ, న్యూ ఢిల్లీ వారి వెబ్ లేదా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్యాలయపు వెబ్‌సైటులో ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలకు సంబంధించిన వివరాలు ఉంటాయన్నారు. పరీక్షలో అర్హత సాధించే విద్యార్థులు కుల, ఆదాయ, 7వ తరగతి మార్కుల శాతం ధ్రువీకరణ పత్రాలతో పాటు ఎవరైనా దివ్యాంగులు ఉంటే వారి వికలత్వ ధ్రువీకరణ పత్రాలు గడువు తేదీలోగా సమర్పించాల్సి ఉందన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ఇచ్చిన గడువులోగా సర్టిఫికెట్లను సమర్పించని విద్యార్థుల వివరాలను తుది జాబితా నుంచి తొలగిస్తామన్నారు.

యానాదులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి



యానాదుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబు

నంద్యాల: ఎన్నో ఏళ్లుగా స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్న యానాదులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసాకు ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు సూచించారు. పట్టణ శివారులో నివాసిస్తున్న యానాదుల ఇళ్ల వద్దకు శుక్రవారం ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా వెళ్లి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యానాదులు గత కొన్నేళ్లుగా తాము పట్టణ శివారులో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నామని, మాకు ఇళ్ల స్థలం, ఇళ్లు లేవని ఆదుకోవాలని కోరారు. గతంలో మాకు కులధ్రువీకరణ పత్రాలు కూడా ఉండేవి కాదని, ప్రస్తుత ప్రభుత్వం అవి ఇస్తుందని చెప్పారు. గృహాలు కూడా మంజూరు చేస్తే మీకు రుణపడి ఉంటామన్నారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ మీ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని యానాదులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్య శంకర్‌నాయక్, జంపారం గల్లి, కుర్రా రామలక్ష్మి, మురళీ, జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్, మాజీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, కృష్ణనాయక్, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగం రాకుండా సర్టిఫికెట్లు మార్చేశారు!

- వైద్య ఆరోగ్యశాఖ తీరుపై ఓ అభ్యర్థిని ఆవేదన

కర్నూలు(హాస్పిటల్): తనకు ఉద్యోగం రాకుండా చేసేందుకు, ఇతరులకు ఉద్యోగం కట్టబెట్టేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు తన సర్టిఫికెట్ల స్థానంలో ఇతరుల సర్టిఫికెట్లు ఉంచారని మాలతి అనే అభ్యర్థిని ఆరోపించారు. ఈ మేరకు ఆమె గత రెండు రోజుల నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగుల చుట్టూ తిరుగుతూ తన గోడు వెల్లబోసుకున్నా పట్టించుకునేవారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కోడుమూరు మండలం వేముగోడు గ్రామానికి చెందిన ఆమె గత నెల 12న వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో కుక్ కమ్ కేర్ టేకర్ పోస్టుకు దరఖాస్తు చేసుకుంది. ఇటీవల విడుదల చేసిన మెరిట్ జాబితాలో తన మార్కులు తక్కువగా ఉండటంతో అనుమానంతో ఆమె కార్యాలయానికి వెళ్లి ఉద్యోగులను నిలదీసింది. ఈ నేపథ్యంలో ఆమె దరఖాస్తు తీసి చూడగా ఆమె పదవ తరగతి సర్టిఫికెట్ స్థానంలో ఇతర అభ్యర్థి సర్టిఫికెట్ ప్రత్యక్షమైంది. మాలతికి టెన్త్‌లో 8.5గ్రేడ్ ఉండగా ఇతర అభ్యర్థి సర్టిఫికెట్‌లో మాత్రం కేవలం 238 మార్కులు మాత్రమే ఉన్నాయి. తన మార్కులు అధికంగా ఉన్నాయని భావించి నాకు పోస్టు దక్కకుండా చేసేందుకు ఇతరులకు కట్టబెట్టేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు ఇలా చేశారని, జిల్లా కలెక్టర్ ఈ విషయమై జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలని ఆమె కన్నీటిపర్యంతమవుతూ కోరింది. ఈ విషయమై ఆమె కార్యాలయ ఏవో డాక్టర్ నాగప్రసాద్‌ను కలవగా తామింకా ఎవ్వరికీ పోస్టు ఇవ్వలేదని, పరిశీలించి న్యాయం చేస్తామని చెప్పారు.

వైభవంగా నిమిషాంబాదేవి ఆలయ వార్షికోత్సవం



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని పార్కు రోడ్డులో ఉన్న నిమిషాంబదేవి ఆలయ వార్షికోత్సవ కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. ఆర్య క్షత్రియ చిత్తారి సంఘం ఆధ్వర్యంలో ఉదయాన్నే కాశివిశ్వేశ్వరుడికి పంచామృతాభిషేకాలు, మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించి స్వామి వారిని నాగాభరణంతో అలంకరింపజేశారు. నిమిషాంబాదేవికి, మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు చేశారు. తర్వాత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చనలు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, సభ్యులు సురేష్‌వర్మ, కుమార్‌వర్మ, ధనుంజయ, కిరణ్, మాధవ, సాయివర్మ పాల్గొన్నారు.

8 మందికి జైలు శిక్ష

దొర్నిపాడు: మద్యం తాగి వాహనాలు నడిపిన 8 మందికి జైలు శిక్ష, మరో ఇద్దరికి జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తిరుపాల్ శుక్రవారం తెలిపారు. గాజుల షరీఫ్, అన్సర్ బాషాలకు రూ.2 వేల ఫైన్ విధించగా నాగదాసు, వగులయ్య, అరుణ్, హరి, గయాబ్‌సా, హుసేన్, భాస్కర్‌రెడ్డి, రాముడు కోవెలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరిచినట్లు వెల్లడించారు. వారికి న్యాయమూర్తి 5 నుంచి 12 రోజులు జైల్ శిక్ష విధించినట్లు తెలిపారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు.

జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యార్థుల ఎంపిక

రుద్రవరం: తమ విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక అయినట్లు ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు శక్రవారం తెలిపారు. ఇటీవల మండలస్థాయిలో సైన్స్‌ఫెయిర్ నిర్వహించారన్నారు. వాటిలో తమ విద్యార్థులు ప్రాజెక్టులు ఆకట్టుకోవడంతో జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 14న జరిగే జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో వాటిని ప్రదర్శిస్తారన్నారు.

వలంటీర్ మృతికి సంతాపం

శిరివెళ్ల: మహదేవపురం గ్రామానికి చెందిన వలంటీర్ జాకీర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రానాథ్‌రెడ్డి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అన్నివిధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నరహరి, సర్పంచు పెద్ది రమణయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్ షాప్ దగ్ధం

ఆళ్లగడ్డ: చాగలమర్రిలోని అడ్డవాగు సమీపంలోని కూల్‌డ్రింక్ షాప్ ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్‌కు గురై కాలిపోయింది. బాధితుడు శ్రీనివాసులు ఎప్పటిలాగా ఉదయం షాప్ తెరిచేందుకు వెళ్లగా అప్పటికే దుకాణంలో నుంచి మంటలు వస్తున్నాయి. సమాచారం మేరకు ఆళ్లగడ్డ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు రూ.3లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

1,419 మంది ఓటర్లు

శిరివెళ్ల: పట్టభద్రులు, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండలంలో 1419 మంది ఓటర్లున్నారని తహసీల్దార్ షేక్ మొయిద్దీన్ ప్రకటించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో 1,333 మంది పట్టభద్రులు, 86 మంది టీచర్లు ఓటు హక్కు వినియోగించుకుంటారన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు.

కార్పొరేట్ సంస్థలకు తొత్తు కేంద్రం



బ్యాంకు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల(అర్బన్): కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు తొత్తుగా మారిందని, ప్రధాని నరేంద్ర మోదీ బడా పారిశ్రామికవేత్తలకు దోచిపెడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు విమర్శించారు. ఆ పార్టీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ సహాయ కార్యదర్శి సోమన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామాంజనేయులు మాట్లాడుతూ ప్రత్యేక హోదా, రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తామని చెప్పి కేంద్రం మోసం చేసిందన్నారు. కర్ణాటకలో జరిగే శాసన సభ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు అప్పర్ భద్ర ప్రాజెక్టుకు రూ.5,300 కోట్లు కేటాయించిందన్నారు. దీని వల్ల నీరు అందక రాయలసీమ ఏడారిగా మారే అవకాశం ఉందన్నారు. అంబానీ, అదానీలకు ఊడిగం చేస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వం గద్దె దిగే వరకు తాము పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు, సీపీఐ నాయకులు మధుబాషా, కరీముల్లా, కలాం, లక్ష్మీదేవి, సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై నిరసన

గోస్పాడు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఐ నాయకులు అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో గోస్పాడులోని గ్రామీణ బ్యాంకు వద్ద వారు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు హరినాథ్, గోకారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, ఎల్‌ఐసీ, ఎయిర్‌పోర్టులు, ఉక్కు కర్మాగారాలను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు విషయంలో బడ్జెట్‌లో మొండి చేయి చూపిందన్నారు. చివరకు మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సైతం సరైన నిధులు కేటాయించకుండా నీరు గార్చిందన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

నంద్యాల(వ్యవసాయం): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం గోపవరం సెయింట్ యాన్స్ మానసిక వికలాంగుల పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మానసిక, చెవిటి, మూగ వికలాంగ విద్యార్థుల నుంచి ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించినట్లు సొసైటీ అధ్యక్షుడు దస్తగిరి, కోశాధికారి నాగేశ్వరరావు తెలిపారు. ఎల్‌వీప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ సౌజన్యంతో పాఠశాలలోని 300 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఆరిఫాభాను, యాకూబ్, మద్దిలేటి, సిస్టర్ రీనాజోన్స్, సిస్టర్ సంఘం, ఎల్‌వీ ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్ కో ఆర్డినేటర్ ప్రేమ్‌సాగర్, దేవయ్య పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



ప్రహ్లాద్‌కు బొకే అందజేస్తున్న కార్మికులు

నంద్యాల(అర్బన్): ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సఫాయి కమిషన్ సభ్యుడు బాయికాటి ప్రహ్లాద్ అన్నారు. పారిశుద్ధ్య కార్మికులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమోఘమని, వారికి ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామన్నారు. అనంతరం చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ సూపర్ వైజర్లు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఆసుపత్రి సూపరింటెండెంట్ వరప్రసాద్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నరసింహులు, సురేష్, సల్మాబేగం, మధు, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



ఆళ్లగడ్డ: చాగలమర్రి మండలం ముత్యాలపాడు గ్రామానికి చెందిన బర్డ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థిని భార్గవిరెడ్డి అండర్-14 జంప్‌రోప్ పోటీల్లో సత్తాచాటి అంతర్జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సింధూర తెలిపారు. త్వరలో అమెరికాలో జరిగే పోటీల్లో భారత జట్టు తరపున సదరు బాలిక ఆడనున్నట్లు చెప్పారు. భార్గవిరెడ్డిని బర్డ్స్ సంస్థల అధినేత పాల్‌రాజారావు, పీఈటీ శంకర్ శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు.


సుబ్బరాయుడికి ఆదాయం

పాణ్యం: వివిధ వేలాల ద్వారా మండల పరిధి లోని కొత్తూరు శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి కి ఆదాయం సమకూరిందని ఈఓ రామక్రిష్ణ తెలిపారు. టెంకాయలు, పూలు, గాజులు, పటముల విక్రయాలకు శుక్రవారం వేలంపాట నిర్వహించారు. టెంకాయల విక్రయ హక్కుల ను రూ.14.40 లక్షలకు మైదుకూరు పట్టణానికి చెందిన అంజనమ్మ, పూల విక్రయ హక్కులను రూ.1.78 లక్షలకు తూర్పు గోదావరికి చెందిన సూర్యనారాయణ, గాజులు, పటముల విక్రయ హక్కులను రూ.25 వేలకు కాల్వబుగ్గకు చెందిన వరలక్ష్మీ దక్కించుకున్నారని ఈఓ తెలిపారు.

నేడు మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఎన్నికలు

కర్నూలు (టౌన్): ఈ నెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు తిరుపతి పట్టణంలోని కరకంబాడీ రోడ్డులో ఉన్న రెడ్డి భవన్‌లో ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం అనంతరం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం కార్యదర్శి జె.లక్ష్మీకాంత్ర రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పుష్ప సోయగం



కనుచూపు మేర పసుపువర్ణంతో ఆకర్షిస్తున్న ఆవాల పంట



గుత్తులు, గుత్తులుగా విరగ్గాసిన తెల్లపూలతో వాము పంట

ఆళ్లగడ్డ నుంచి దొర్నిపాడు మీదుగా కోవెలకుంట్లకు వెళ్లే దారిలో రబీ పంటలు కళకళలాడుతున్నాయి. ఈ మార్గంలో కొందరు రైతులు వరికోతల తర్వాత పొలాల్లో ఆవాలు, వాము విత్తనాలు చల్లారు. ఆయా పంటలు ఇప్పుడు పూతదశకు చేరుకుని కనువిందు చేస్తున్నాయి. దారిన వెళ్లే వారు ఆ పంట పొలాల వద్ద నిలబడి సెల్ఫీలు తీసుకుంటున్నారు.

–దొర్నిపాడు